# అశ్వగంధ

దీనిని తెలుగులో పెన్నేరు గడ్డలు అని కూడా పిలుస్తారు. దీని వేర్లనుండి విథాఫెరిన్ 'ఎ' మరియు 'బి' అను ఆల్కలాయిడ్స్ లభిస్తాయి. దీని వేర్లు మరియు ఆకులు ఆయుర్వేద మరియు యునాని ఔషధ తయారీకి ఉపయోగిస్తారు.

**నేలలు :** ఇసుక గరపనేలలు లేదా తేలికపాటి ఎర్రనేలలు అనుకూలం. ఉదజని సూచిక 7.5-8.0 ఉండాలి.

**వాతావరణం :** ఖరీఫ్‌లో ఆలస్యంగా సాగుచేస్తారు. కనీసం 65-70 సెం.మీ. వర్షపాతం అవసరం. వర్షపాతం సరిపోనియెడల 2-3 సార్లు నీటి తడులివ్వాలి. పొడి వాతావరణము సాగుకు అనుకూలం.

**రకాలు :** జవహార్ అశ్వగంధ-20, పోషిత, రక్షిత మరియు నాగోర్.

**విత్తేసమయం :** ఖరీఫ్‌లో జూలై-ఆగష్టులో విత్తుకోవాలి (జూలై-డిసెంబర్/జనవరి), అక్టోబర్-నవంబర్‌లో నీటిపారుదల క్రింద రెండవ పంటగా వేసుకోవచ్చు.

**విత్తనమోతాదు :** ఎకరాకు 6-8 కిలోలు (నేరుగా విత్తేందుకు) కనీసం 5 రెట్లు ఇసుకతో కలిపి విత్తుకోవాలి.

**నాటేదూరం :** వరుసలలో నాటుకోవటం అంత లాభసాటికాదు. వెదజల్లడం వలన మొక్కల సాంద్రత ఎక్కువ ఉంటుంది. తద్వారా దిగుబడి కూడా ఎక్కువ వస్తుంది.

**ఎరువులు :** ఆఖరి దుక్కిలోఎకరాకు 4-5 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల భాస్వరం మరియు 16 కిలోల పొటాష్ వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :** వర్షాధారంగా సాగుచేస్తే పంటకాలంలో 2-3 సార్లు నీటి తడులివ్వాలి (3, 4 మరియు 5వ నెలలో)

**అంతరకృషి :** నేరుగా విత్తినపుడు 20-25 రోజుల తరువాత మొక్కలు పలుచన చేయాలి. కలుపు తీయాలి.

**సస్యరక్షణ :** విత్తనపు కుళ్ళు, మొక్క మరియు ఆకు ఎండుతెగుళ్ళు రాకుండా ఉండేందుకు 3 గ్రా. క్యాప్టాన్ లేదా మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేయాలి. ముప్పైరోజుల వయస్సులో లీటరు నీటికి 3 గ్రా. మాంకోజెబ్ కలిపి పిచికారి చేయాలి. తెగులు నివారణ కాకపోతే 7-10 రోజుల తరువాత మరొకసారి పిచికారి చేయాలి.

**కోత మరియు దిగుబడి :** జనవరి నుండి మార్చి వరకు కోతకు వస్తుంది. పంటకాలం 150-170 రోజులు. దిగుబడి ఎకరాకు 200-300 కిలోలు ఎండువేర్లు మరియు 30 కిలోల విత్తనం వస్తుంది.

**ఆదాయ వ్యయాలు :** ఎకరాకు రూ. 10,000 ఖర్చు, రూ. 30,000-45,000 మొత్తం ఆదాయం, తద్వారా రూ. 20,000-35,000 నికరాదాయం వస్తుంది.